- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
21-04-2026

సంపుటి : 01 సంచిక : 30 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE :30 NAMASTEY MAHAAPRABHA



## కల్వకుంట్ల కుటుంబానికి

# కాలం చెల్లింది

### వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదు

- వచ్చే ఎన్నికల్లో రా...తేల్చుకుందాం
- కాళేశ్వరంలో లక్షకోట్లు మింగారు
- రైతు సంక్షేమం కాంగ్రెస్ విధానం
- రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల
- 2034 వరకు మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం
- 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం
- మహేశ్ గౌడ్, నా జోడీతో మళ్లీ అధికారం దక్కించుకుంటాం
- నస్పూర్‌పల్లిలో బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి,ఏప్రిల్ 20( మహాప్రభ)

తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి వస్తానని భ్రమపడుతున్నారని, కానీ తెలంగాణలో ఆ కుటుంబం శకం శాశ్వతంగా ముగిసిపోయిందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతి, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఎలాగైతే తిరస్కరించారో, 2029 ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే చట్టాన్ని -మిగతా 3 లో



## మళ్లీ తెలంగాణ నాటి

# ఉద్యమ పరిస్థితులు

### ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ మోసం

- పునర్నిర్మాణ మహాయజ్ఞంలో భాగస్వాములు అవుదాం
- అన్నింటా దరిద్రం తాండవిస్తోంది
- రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు మొదలుకుని అందరికీ దగా
- యూరియా కోసం మళ్లీ క్యూలు కట్టాల్సిన దుస్థితి
- ప్రాజెక్టులను పడావు పెట్టారు.. కరెంట్‌కు ఎగనామం పెట్టారు
- భూకబ్జాలు..అవినీతి తాండవిస్తోంది
- జగిత్యాల సభలో కెసిఆర్ విమర్శలు



రెండేళ్లయినా ఒక్క నిర్మాణాత్మక పనిలేదు

జగిత్యాల,ఏప్రిల్ 20( మహాప్రభ)

తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులు మళ్లీ దాపురించాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ చుట్టుముట్టాయని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ పునర్నిర్మాణ మహాయజ్ఞంలో అందరూ కలసి రావాలని పిలుపుపిచ్చారు. ఏ వర్గం కూడా ఇప్పుడు సంతోషంగా లేరని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు మొదలుకుని అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ప్రాజెక్టులను పడావు పెట్టారని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల -మిగతా 3 లో



## వచ్చే 4, 5 రోజులు

# నిప్పుల కొలిమే

- ఏప్రిల్ 25 వరకు దేశంలో తీవ్ర వడగాల్పులు
- కొన్ని రాష్ట్రాల్లో మాత్రం వడగళ్ల వానలు
- ఐఎండీ హెచ్చరికలు జారీ

న్యూఢిల్లీ ఏప్రిల్ 20( మహాప్రభ)

దేశంలో ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. కాగా రానున్న నాలుగు రోజుల పాటు దేశంలోని వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు (హీట్ వేవ్) వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తెలిపింది. ముఖ్యంగా ఏప్రిల్ 20 నుంచి ఏప్రిల్ 25 మధ్య వివిధ తేదీల్లో హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పంజాబ్, తూర్పు రాజస్థాన్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పశ్చిమ రాజస్థాన్, మధ్యప్రదేశ్, గంగానది పరివాహక పశ్చిమ బెంగాల్, కూర్గ్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. ఉష్ణోగ్రత: ఏప్రిల్ 20-24 మధ్య గంగా పరివాహక పశ్చిమ బెంగాల్; ఏప్రిల్ 20-22 మధ్య తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్; ఏప్రిల్ 20-24 మధ్య కేరళ, మాహే, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, యానాం; ఏప్రిల్ 24, 25 తేదీల్లో -మిగతా 3 లో



## విజయ్-సంగీతలో

# విడాకుల వ్యవహారం

- కేసు జూన్ 15కు వాయిదా వేసిన కోర్టు
- భరణంపై కోర్టు బయట బేరసారాలు
- ఎన్నికల అఫిడవిట్ ఆధారంగా భరణం డిమాండ్
- 35 కోట్లు మాత్రమే ఇస్తానన్న విజయ్

చెన్నై,ఏప్రిల్ 20( మహాప్రభ)

కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్ గా మారింది. ఒక వైపు రాజకీయంగా ప్రత్యర్థుల నుంచి విమర్శలు, మరోవైపు వైవాహిక బంధంలో ఒడిదుడుకులు ఇప్పుడు దళపతినిఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విజయ్ భార్య సంగీత దాఖలు చేసిన విడాకుల పిటిషన్ పై చెంగల్పట్టు కోర్టు విచారణను జూన్ 15కు వాయిదా వేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిమాణాలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే విజయ్ - సంగీత జంట పరస్పర అంగీకారంతో విడిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. -మిగతా 3 లో

# జపాన్‌లో భారీ భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు
- సునామీ హెచ్చరిక జారీ




టోక్యో,ఏప్రిల్ 20( మహాప్రభ)

: జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైంది. దీంతో సునామి హెచ్చరిక జారీ చేశారు. భూ ప్రకంపనల తీవ్రత కారణంగా వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న టోక్యో వరకు పెద్ద భవనాలు కంపించాయి. మూడు మీటర్ల అంటే సుమారు 10 అడుగుల ఎత్తు వరకు అలలు ఎగసిపడే అవకాశం ఉందని జపాన్ వాతావరణ సంస్థ సునామీ హెచ్చరిక జారీ చేసింది. తొలి సునామీ అలలు వెంటనే ఉత్తర తీరాన్ని చేరుకోవచ్చని -మిగతా 3 లో

# పశ్చిమ బెంగాల్లో అభివృద్ధి శూన్యం

- 15 ఏళ్లుగా అధికారంలో బెంగాల్ వెనకబాటు
- దేశ ఆర్థిక వృద్ధిలో 10 శాతంగా ఉన్న పశ్చిమబెంగాల్ టీఎంసీ అధికారంలోకి వచ్చాక 5 శాతానికి పడిపోయింది
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు



కోల్‌కతా, ఏప్రిల్ 20( మహాప్రభ)

పశ్చిమబెంగాల్‌లో దశాబ్దానికి పైగా టీఎంసీ అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాలు కేవలం 5 నుంచి 8 ఏళ్లలో అభివృద్ధి సాధించాయని, దేశ ఆర్థిక వృద్ధిలో 10 శాతంగా ఉన్న పశ్చిమబెంగాల్ టీఎంసీ అధికారంలోకి వచ్చాక 5 శాతానికి పడిపోయిందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ మార్పును -మిగతా 3 లో

## 20 మాసాలుగా కాంగ్రెస్‌లో

# మానసిక క్షోభ

- కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తే ఇదా శిక్ష
- భావోద్వేగానికి గురయిన మాజీమంత్రి జీవన్ రెడ్డి



జగిత్యాల ఏప్రిల్ 20( మహాప్రభ)

క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మాజీ మంతంరి జీవన్ రెడ్డి తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా -మిగతా 3 లో

## భారత్-కొరియా మధ్య

# వాణిజ్య ఒప్పందం

### 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేరువ

- మా మధ్య సంబంధాలకు ప్రజాస్వామ్య విలువలే పునాది
- వాణిజ్య అంతరాయాలను తగ్గించుకునేలా నిర్ణయాలు
- సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం, చర్చలు ప్రారంభించడానికి అంగీకారం
- ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం కలిసి పనిచేయాలని నిర్ణయం
- ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌ల మధ్య చర్చలు

న్యూఢిల్లీ: ఏప్రిల్ 20( మహాప్రభ)

భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా పెరుగుతున్న వాణిజ్య అంతరాయాల నేపథ్యంలో భారత్ - దక్షిణ కొరియాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇరు దేశాల మధ్య ఉన్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చర్చలు ప్రారంభించడానికి అంగీకరించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌ల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. -మిగతా 3 లో



## ఐపీఎల్ 2026లో ముంబై

# రెండో విజయం

- గుజరాత్ టైటాన్స్‌పై 99 రన్స్ తేడాతో విక్టరీ
- అజేయ సెంచరీతో సత్తాచాటిన తిలక్ వర్మ



న్యూఢిల్లీ:ఏప్రిల్ 20( మహాప్రభ)

ఐపీఎల్ 2026లో వరుస ఓటములకు ముంబై ఇండియన్స్ బ్రేక్ వేసింది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ విజయం తర్వాత వరుసగా నాలుగు మ్యాచులలో ఓడిపోయిన ముంబై.. గుజరాత్ టైటాన్స్‌తో ఘన విజయం సాధించింది. తిలక్ వర్మ అజేయ సెంచరీతో జట్టుకు భారీ స్కోరు అందించగా.. బౌలర్లు కూడా తమ పని తాము చేయడంలో విజయం సాధించారు. గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లకు కళ్లెం వేశారు. దీంతో ఐపీఎల్ 2026లో ముంబై రెండో విజయాన్ని నమోదు చేసింది. -మిగతా 3 లో

# ట్రంప్ చెబితే.. మోదీ ఇజ్రాయెల్ వెళ్లారు



**తూత్తుకుడి,ఏప్రిల్ 20( మహాప్రభ)**
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పినట్లే ప్రధాని మోదీ ప్రవర్తిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తమిళనాడులోని తూత్తుకుడిలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ ఆదేశాల ప్రకారమే మోదీ ఇజ్రాయిల్ పర్యటనకు వెళ్లినట్లు తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు అకస్మాత్తుగా ఇరాన్‌పై అటాక్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ ఘటనకు మూడు రోజుల ముందే ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఆయన నెతన్యహూతో భేటీ అయ్యారు. ఈ అంశాన్ని రాహుల్ గాంధీ తన ఎన్నికల ప్రచార ప్రసంగంలో ప్రస్తావించారు. ఒకవేళ ట్రంప్ దూకమంటే, మోదీ దూకేస్తారని అన్నారు. ఇరాన్‌లో వార్ ప్రారంభంకావడానికి ముందు ట్రంప్ ఆదేశాల ప్రకారం మోదీ ఇజ్రాయెల్ వెళ్లి వచ్చారని, దానికి కారణం చాలా సింపుల్ అని, ఎప్‌స్టీన్ ఫైల్స్.. అదానీ అని రాహుల్ ఆరోపించారు.

# స్టాలిన్ ను కలిసి కేజ్రీవాల్



**చెన్నై : ఏప్రిల్ 20( మహాప్రభ)**
ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోమవారం తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ ను కలిశారు. ఈ సందర్భంగా స్టాలిన్ చేపట్టిన విద్య, ఆరోగ్యసంరక్షణ, మహిళల సాధికారతకు సంబంధించి కీలక రంగాల్లో ప్రభుత్వం చేస్తున్న కృషిని కేజ్రీవాల్ స్టాలిన్ ప్రశంసించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ లో పోస్టు చేశారు. 'తమిళనాడు ముఖ్యమంత్రి తిరు ఎం.కె స్టాలిన్ ను కలవడం గౌరవంగా ఉంది. విద్య, ఆరోగ్య సంరక్షణ, మహిళా సాధికారత విషయాలలో మా ఇద్దరికీ ఒకే విధమైన దృక్పథం ఉంది. మేము ఎల్లప్పుడూ ఒకరి నుండి ఒకరు నేర్చుకుంటూనే ఉన్నాము. తమిళనాడు ప్రజల జీవితాలను మార్చడంలో ఆయన అంకితభావంతో చేస్తున్న పాలనను నేను ఎంతగానో అభినందిస్తున్నాను- అని కేజ్రీవాల్ పోస్ట్ లో పేర్కొన్నారు.


# చెట్టును ఢీకొట్టి.. కొండపై కూలిన ప్రైవేట్ జెట్ విమానం



**రాయ్‌పూర్ ఏప్రిల్ 20( మహాప్రభ)**
ఒక ప్రైవేట్ జెట్ విమానం చెట్టును ఢీకొట్టింది. అదుపుతప్పిన అది కొండపై కూలింది. సంఘటనా స్థలంలో మంటలు, పొగలు కనిపించాయి. పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు ఛత్తీస్‌గఢ్‌లోని జష్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం జష్‌పూర్ -- నారాయణ్‌పూర్ అటవీ ప్రాంతంపై తక్కువ ఎత్తులో ఎగురుతున్న ప్రైవేట్ జెట్ విమానం ఒక చెట్టును ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ విమానం కొండ వాలుపై కూలిపోయింది. దీంతో మంటలు, పొగలు కనిపించాయి.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కూలిన చార్టడ్ విమానంలోని పైలట్, కో పైలట్ మరణించినట్లు గుర్తించారు. ఈ విమానం కూలిన సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# వామపక్షాలను గెలిపించండి

**సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం**



**కోల్‌కతా,ఏప్రిల్ 20( మహాప్రభ)**
: పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో వామపక్షాలను గెలిపించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం ప్రజలను కోరారు. సోమవారం నాడు మాల్దా జిల్లాలోని హరీష్‌చంద్రపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో లెఫ్ట్ ఫ్రంట్ నిర్వహించిన భారీ ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ బిజెపి, టిఎంసిలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష పార్టీలు ప్రజా అనుకూల విధానాలను ప్రజల ముందు ఉంచాయన్నారు. సిపిఎం పార్టీ అభ్యర్థి షేక్ ఖలీల్‌కు మద్దతు తెలపాలని కోరారు.

# ఏసు క్రీస్తు విగ్రహం ధ్వంసం..

## ఖండించిన ఇజ్రాయిల్ ప్రధాని



**జెరుసలాం,ఏప్రిల్ 20( మహాప్రభ)**
దక్షిణ లెబనాన్‌లో ఏసు క్రీస్తు విగ్రహాన్ని ఓ ఇజ్రాయిలీ సైనికుడు ధ్వంసం చేసినట్లు ఫోటో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఆ ఘటన పట్ల ఇప్పటికే ఇజ్రాయిల్ రక్షణ దళం, విదేశాంగ మంత్రి క్షమాపణలు చెప్పారు. తాజాగా ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ(దీవఅయిఖఎఆఅ చీమ్ఖఅఖిష్ట్రబ) కూడా ఆ ఘటనను ఖండించారు. దక్షిణ లెబనాన్‌లో గ్రౌండ్ ఆపరేషన్ చేస్తున్న సమయంలో ఇజ్రాయిలీ సైనికుడు శిలువ వేసిన ఏసు విగ్రహన్ని ధ్వంసం చేసినట్లు సోషల్ మీడియాలో ఓ ఫోటో వైరల్ అయ్యింది. అయితే మతసహనానికి విరుద్ధంగా ఆ సైనికుడి చర్యలు ఉన్నట్లు నెతన్యహూ పేర్కొన్నారు. ఓ క్యాథలిక్ మతానికి చెందిన విగ్రహన్ని ఐడీఎఫ్ సైనికుడు ధ్వంసం చేయడం తనను స్టన్‌కు గురిచేసిందని, ఆ ఘటన బాధగా ఉందని, చాలా కఠినమైన రీతిలో ఆ ఘటనను ఖండిస్తున్నట్లు తన ఎక్స్ అకౌంట్‌లో నెతన్యహూ రాశారు. ఈ ఘటన పట్ల మిలిటరీ అధికారులు దర్యాప్తు చేపడుతున్నారని, కఠినమైన క్రమశిక్షణ చర్యలను తీసుకుంటారని ఆయన అన్నారు. వివిధ మతాలను సమానంగా చూస్తామన్నారు. తమ నేలపై అన్ని మతాలు వర్ధిల్లుతాయని, తమ దేశ, ప్రాంత నిర్మాణంలో భాగమైన అన్ని మతాలను సమానంగా ఆదరిస్తామన్నారు. సిరియా, లెబనాన్ దేశాల్లో క్రైస్తవులను ముస్లింలు హతమార్చుతున్నారని, కానీ పశ్చిమాసియాలోని ఇజ్రాయిల్‌లో మాత్రం క్రైస్తవ జనాభా క్షేమంగా ఉందన్నారు. కేవలం ఇజ్రాయెల్‌లో మాత్రమే క్రైస్తవుల జనాభా, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడినట్లు చెప్పారు. పశ్చిమాసియా ప్రాంతంలోని ఇజ్రాయెల్‌లో మాత్రమే మతస్వేచ్ఛ ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటన పట్ల లెబనాన్‌తో పాటు ఇతర ప్రాంతాల ప్రజల మనోభావాలు దెబ్బతింటే, వారికి తాము క్షమాపణలు చెబుతున్నట్లు నెతన్యహూ తన ఎక్స్‌లో పేర్కొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో 48 ఫిర్యాదులు స్వీకారం





**రంగారెడ్డి – ఏప్రిల్ 20 ( మహాప్రభ )**
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 48 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి వివరించి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం పరిశీలిస్తూ వేగంగా పరిష్కారం చేయాలని సూచించారు. అందిన ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 8 కాగా, ఇతర శాఖలకు చెందినవి 40 ఉన్నాయి. మొత్తం 48 దరఖాస్తులు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, ఎక్కడా ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి (రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'హర్మూజ్'లో భారత నౌకలకు ఇండియన్ నేవీ అడ్వయిజరీ



**న్యూఢిల్లీ :ఏప్రిల్ 20( మహాప్రభ)**
హర్మూజ్ జలసంధి లో భారత జెండా తో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు ఇటీవల కాల్పులు జరిపాయి. ఈ నేపథ్యంలో భారత జెండా కలిగిన నౌకలకు మన నౌకాదళం అడ్వయిజరీ జారీ చేసిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మూజ్‌లో ప్రయాణించాలని నేవీ పేర్కొన్నది. ఆ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించేందుకే ఈ సూచనలని తెలిపింది. లారక్ ద్వీపం హర్మూజ్‌కు సమీపంలో ఉంటుందని చెప్పింది. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి 11 నౌకలు ఈ జలమార్గాన్ని దాటాయి. ఈ జలసంధిని దాటిన చివరి ట్యాంకర్ దేశ్ గరిమ. అదేరోజు జగ్ అర్ణవ్, సన్మార్ హెరాల్డ్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా.. ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనను విదేశాంగశాఖ ఖండించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ఈ ఘటనపై నిరసనను తెలియజేసింది. గతంలో తమ దేశానికి బయల్దేరిన అనేక నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని ఈ సందర్భంగా గుర్తుచేసింది.

# అఫిడవిట్లలో రూ.100 కోట్ల తేడా ఉంది..

**-టీవీకే చీఫ్ విజయ్‌కి మద్రాస్ హైకోర్టు నోటీసులు**



**న్యూఢిల్లీ :ఏప్రిల్ 20( మహాప్రభ)**
టీవీకే చీఫ్ విజయ్ కి మద్రాసు హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో అవకతవకలు ఉన్నాయంటూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దానిని పరిశీలించిన అనంతరం సోమవారం కోర్టు ఈ నోటీసులు ఇచ్చింది. విజయ్‌కి సమర్పించిన అఫిడవిట్లలో తేడాలు ఉన్నాయంటూ చెన్నైకి చెందిన వీవీ విఘ్నేశ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. కాగా తిరుచ్చి, పెరంబూర్ నియోజకవర్గాల నుంచి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పోటీచేస్తున్నారు. పెరంబూర్‌లో సమర్పించిన అఫిడవిట్‌లో ఆయన ఆస్తుల వివరాలు రూ.115 కోట్లుగా ఉండగా.. తిరుచ్చిలో రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఇచ్చిన వివరాల్లో వెల్లడించిన ఆస్తుల విలువ రూ.220 కోట్లుగా ఉందని పిటిషనర్ ఆరోపించారు. ఇలా ఎందుకు తేడా చూపించాల్సి వచ్చిందో వివరించేలా ఎలాంటి అనుబంధ పత్రాలు విజయ్ ఇవ్వలేదన్నారు. కాగా వచ్చేవారం దీనిపై తదుపరి విచారణ జరగనుంది.

# చికాగో అమరవీరులు స్ఫూర్తితో మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి.

**-సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీమ్**




**దేవరకొండ ఏప్రిల్ 20( మహాప్రభ)**
ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీమ్ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండ మండల కేంద్రంలో సి ఐ టి యు జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 140 ఏళ్ల క్రితం చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేసిన పోరాటం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచిందని గుర్తు చేశారు. ఆనాడు కార్మికులు చిందించిన రక్తం ఫలితంగానే 8 గంటల పని విధానం, సెలవు సౌకర్యాలు మరియు కనీస వేతన చట్టాలు ఏర్పడ్డాయని తెలియజేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని 4 కార్పొరేట్ అనుకూల 'లేబర్ కోడ్‌లు'గా మార్చడం కార్మిక వర్గానికి పెను ప్రమాదమని సలీమ్ హెచ్చరించారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే వెసులుబాటును ఈ కోడ్‌లు కల్పిస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన సంఘటితమయ్యే హక్కు, నిరసన హక్కు, సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే అధికారాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు యాజమాన్య భద్రత కవచాలుగా మారడం శోచనియం అన్నారు. లేబర్ కోడ్స్ అమలవుతున్న నేపథ్యంలో దేశంలో పెరిగిన ద్రవ్యల్గణం, ఇండ్ల అద్దెలు,ఆహార ధరలు, పిల్లల చదువులు, వైద్యం ఖర్చులు కార్మికులకు మోయలేని భారాలైన నేపథ్యంలో కార్మికుల సంఘటితమై తమ బ్రతుకులు మార్చు కొరకు ఈ మేడను ఉద్యమంగా వాడవాడలా గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించి మే డే జెండాలను ఎగురవేసి పోరాట స్ఫూర్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సి ఐ టి యు సీనియర్ నాయకులు యాదగిరి, మండల కన్వీనర్ ఎండి రహీం, హమాలీ యూనియన్ నాయకులు రామావత్ జబ్బార్, రామావత్ రవి, జని ముత్యాలు, రామావత్ వినోద్ వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

## వచ్చే 4, 5 రోజులు నిప్పుల కొలిమే

మొదటి తరువాయి

గుజరాత్ తీర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగే వాతావరణం ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. రాత్రి వేళల్లో అధిక ఉష్ణోగ్రతలు: ఏప్రిల్ 20, 21 తేదీల్లో హర్యానా, చండీగఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాల్లోనూ; ఏప్రిల్ 20–23ల్లో ఢిల్లీ, ఏప్రిల్ 20–22 మధ్య ఒడిశాలో రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండొచ్చని ఐఎండీ వెల్లడించింది. ఉరుములతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు: మరోవైపు సోమవారం నాడు దక్షిణ మధ్య కేరళ, తమిళనాడు తీరప్రాంతాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ఏప్రిల్ 22న ఈశాన్య భారత్‌లోని అసోం, మేఘాలయా, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన వానలు పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

## విజయ్-సంగీతలో విడాకుల వ్యవహారం

మొదటి తరువాయి

ఈ మేరకు శనివారం చైన్నైలో ఇరువురి లాయర్లు కలిసి చర్చించినట్లు సమాచారం. విడిపోయేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అయితే సెటిల్ మెంట్ కింద ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించిన ఆస్తుల ఆధారంగా , తన ఇద్దరు పిల్లలు భవిష్యత్తు కోసం సుమారు రూ. 250 కోట్లు భరణం సంగీత కోరినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే విజయ్ మాత్రం సంగీతకు రూ. 35 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సమచారం. కుమారుడు, కుమార్తె బాగోగులు తాను చూసుకుంటానని విజయ్ అన్నట్లు తెలుస్తోంది. అయితే విడాకుల వ్యవహారం కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోదని సమాచారం. విజయ్ నుంచి విడాకుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో సంగీత పిటిషన్ దాఖలు చేశారు. అందులో ఆమె పేర్కొన్న అంశాలు కోలీవుడ్‌లో కలకలం రేపుతున్నాయి. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపించారు. తనను మానసిక, శారీరక వేధింపులకు గురిచేశారని, కనీస ఆర్థిక స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కదలికలపై ఆంక్షలు విధించారని, మాటలతో తీవ్రంగా కించపరిచారని ఆమె వాపోయారు. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. తన సొంత పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన విజయ్‌కు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. అయితే, సరిగ్గా ఎన్నికల ప్రచార సమయంలో ఈ విడాకుల వ్యవహారం తెరపైకి రావడం ఆయనకు ప్రతికూలంగా మారుతుందా అన్న చర్చ సాగుతోంది. మరి ఈ విడాకుల వ్యవహారం రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి మరి.

## జపాన్‌లో భారీ భూకంపం

మొదటి తరువాయి

వాతావరణ సంస్థ తెలిపింది. సునామీ అలలు పదేపదే తాకే అవకాశం ఉందని.. హెచ్చరికను ఉపసంహరించుకునే వరకు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. సంక్షోభ నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## పశ్చిమ బెంగాల్లో అభివృద్ధి శూన్యం

మొదటి తరువాయి

తీసుకురావాలని ఓటర్లను కోరారు. సోమవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు వరుసగా మూడుసార్లు టీఎంసీకి అధికారం ఇచ్చారని, 15 ఏళ్లు అంటే అదేమంత తక్కువ సమయం కాదని చెప్పారు. పశ్చిమబెంగాల్ ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారని, ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఈసారి బీజేపీకి బాసటగా నిలవాలని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. 'భయాందోళనల మధ్య ఇక్కడి ప్రజలు కాలం నెట్టుకొస్తున్నారు. వారందరికీ ఒకటే చెప్పదలచుకున్నాను. ఈసారి మార్పు తప్పనిసరిగా రావాలి. బీజేపీకి మీరంతా అండగా నిలబడాలి' అని విజ్ఞప్తి చేశారు. మహిళా సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉందని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రధానమంత్రి మోదీ స్థిరనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. 'ఇవాళ కాకపోతే, రేపు అది జరిగి తీరుతుంది' అని భరోసా ఇచ్చారు.పశ్చిమబెంగాల్‌లో బీజేపీ విజయావకాశాలపై రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని సీట్లు వస్తాయనేది చెప్పలేను కానీ, బీజేపీకి స్పష్టమైన మెజారిటీ వచ్చితీరుతుందన్నారు. మూడింట రెండు వంతుల సీట్లు ఖాయమని చెప్పారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## భారత్-కొరియా మధ్య వాణిజ్య ఒప్పందం

మొదటి తరువాయి

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం కలిసి పనిచేయాలని కూడా నిశ్చయించారు. మాడ్రిడ్‌లో పర్యటన కోసం భారత్‌కు వచ్చిన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ప్రధాని మోదీ చర్చలు జరిపారు. సెమీ కండక్టర్ తయారీ, రక్షణ రంగం, హరిత ఇంధనం, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం వంటి అంశాలపై పలు ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి.

భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ప్రజాస్వామ్య విలువలే పునాది అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు వాణిజ్య వాటాను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన అనేవి ఇరు దేశాల డీఎన్ఏలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇరు దేశాల చర్చల అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడిన ప్రధాని, భారత్–దక్షిణ కొరియాల మైత్రి ప్రపంచానికి శాంతి, స్థిరత్వం సందేశాన్ని ఇస్తుందని మోదీ అన్నారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత సృష్టి కోసం ఇరు దేశాల ఒకే విధమైన దృక్పథాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు.

## 20 మాసాలుగా కాంగ్రెస్‌లో మానసిక క్షోభ

మొదటి తరువాయి

ఉన్నారని తెలిపారు. జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలోనే కేసీఆర్ తనను పార్టీలోకి ఆహ్వానించారని జీవన్ రెడ్డి తెలిపారు. కానీ క్రమశిక్ష కలిగిన వ్యక్తిగా కాంగ్రెస్‌లోనే కొనసాగానని పేర్కొన్నారు. ఉద్యమ రథసారథిగా కేసీఆర్ తెలంగాణ సాధించారని అన్నారు. అలాంటి వ్యక్తితో పనిచేసే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కల్యాణలక్ష్మి పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కానీ ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు.

## కల్వకుంట్ల కుటుంబానికి కాలం చెల్లింది

మొదటి తరువాయి

తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ప్రజాపాలనలో రైతు ఉత్సవాల పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. సభావేదిక పైనుంచి రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తొలిపార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఏడాదిలోపే చేసి చూపించాం. 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు వేశాం. గత విడతలో రైతుభరోసా కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు వేశాం. ఇవాళ రెండో విడతగా రూ.5,700 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. మిగతా రూ.3,300 కోట్లు వచ్చే నెలలో రైతుల ఖాతాల్లో వేస్తాం. రాష్ట్రంలో 3.5 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన గతంలో ఎవరికైనా వచ్చిందా? అన్నారు. గతంలో వైఎస్ఆర్– డి.శ్రీనివాస్ జోడీ కాంగ్రెస్‌ను వరుసగా ఎలా గెలిపించిందో, ఇప్పుడు తాను, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేరుస్తామని ఆయన శపథం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం అని, వారిచ్చిన తీర్పును గౌరవించకుండా కేసీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడటం ఆయన భ్రమలకు నిదర్శనమని రేవంత్ మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలు 'చిల్లర మాటలు' అంటూ కొట్టిపారేసిన సీఎం, రాష్ట్ర ప్రజలు కల్వకుంట్ల కుటుంబాన్ని ఎప్పటికీ క్షమించరని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తమను మళ్లీ గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందని, ఇకపై తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ హవా మాత్రమే కొనసాగుతుందని రేవంత్ రెడ్డి కార్యకర్తల సాక్షిగా ప్రకటించారు. విపక్షాల విమర్శలకు తాము చేసే అభివృద్ధే సమాధానం చెబుతుందని, క్షేత్రస్థాయిలో పార్టీని



మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. రైతు భరోసా రెండో విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. 40 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం.. కాంగ్రెస్ నినాదమే కాదు, విధానమని ఉద్ఘాటించారు. పంటలకు గిట్టుబాటు ధర తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని నొక్కిచెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఊడగొడతామని హెచ్చరించారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు ముంచారని ఆగ్రహించారు. కేసీఆర్‌కు ఉరి వేసినా తప్పులేదని హెచ్చరించారు. వరుస ఎన్నికల విజయంతో ఆయనకు ఘోరీ కట్టామని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో తేల్చుకుందాం.. దమ్మంటే రావాలని సవాల్ విసిరారు. ప్రజాపాలనో.. పాపాల భైరవుడో తేల్చుకుందామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఘోరీపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2034 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తల సాక్షిగా ఇదే తన సవాల్ అని పేర్కొన్నారు.

ప్రజాపాలన ఎందుకు పోవాలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నందుకు ప్రజాపాలన పోవాలా? అని నిలదీశారు. కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ హయాంలో రూ.20 లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ 20 వేల ఇళ్లు కూడా ఎందుకు కట్టలేదని నిలదీశారు. 4.5 లక్షల ఇళ్లు ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? అని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వనందుకు ప్రజాపాలన పోవాలా? అని నిలదీశారు. ప్రజాపాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలని జీవన్‌రెడ్డి అంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలు గడీల పాలన పోవాలనే కాంగ్రెస్ పాలన తెచ్చుకున్నారని ప్రస్తావించారు. జీవన్‌రెడ్డి మాజీ సీఎం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నాదెండ్లతో జతకట్టారని విమర్శించారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తలు జీవన్‌రెడ్డిని పల్లకీపై మోశారని ప్రస్తావించారు. తమ ప్రభుత్వం గడీలకు ఊడిగం చేయాలా? అని ప్రశ్నించారు. గతంలో ఆడబిడ్డలు బతుకమ్మ చీరలు కట్టి పండుగ చేసుకున్నారా? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని ఎప్పుడైనా ఆలోచించారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. వాస్తు బాగా లేదని బాగున్న సచివాలయం కూల్చి కొత్తగా కట్టుకున్నారు. బిడ్డ, కొడుకు, తండ్రి ఇలా తలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలనే ఆలోచన ఏనాడైనా వచ్చిందా?పేదలు.. దొరల గడీల ముందు ఊడిగం చేస్తూ అలాగే ఉండాలని భావించారు. పేదలు కట్టుకోవడానికి పనికిరాని బతుకమ్మ చీరలు పంచారు. వేములవాడకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించి.. పదేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదు. కేసీఆర్.. నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్. 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## మళ్లీ తెలంగాణ నాటి ఉద్యమ పరిస్థితులు

మొదటి తరువాయి

కోసమే బీఆర్ఎస్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేరారని తెలిపారు. 45 ఏళ్ల నుంచి జీవన్‌రెడ్డితో తమకు స్నేహం ఉందని ప్రస్తావించారు. సోమవారం జగిత్యాలలో కేసీఆర్ పర్యటించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ సమక్షంలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగించారు. రెండేళ్లలో ఒక్క నిర్మాణాత్మక పని కూడా కాంగ్రెస్ చేపట్టలేదన్నారు. ఉద్యమనాటి పరిస్థితులు మళ్లీ దాపరించాయని, ఎరువుల బస్తాలకు మళ్లీ క్యూలో చెప్పులు పెట్టాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. కరెంట్ ఆగం అయ్యిందని, మిషన్ బగిరథ మూలన పడిందన్నారు. పెట్టిన ఇల్లులాగా ఉన్న తెలంగాణను అప్పగి÷–తే సర్వనాశనం చేశారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పేరు ఎక్కడా ఎత్తకుండా కాంగ్రెస్ పాలనపై ధ్వజమెత్తారు. తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో భయంకర పరిస్థితులు ఉండేవని

కెసిఆర్ వ్యాఖ్యానించారు. గతంలో తెలంగాణ పదం పలకడానికే భయపడే రోజులు ఉండేవని పేర్కొన్నారు. భిన్న రాజకీయ పార్టీల వల్లే జీవన్‌రెడ్డి, తాము వేర్వేరుగా పనిచేశామని అన్నారు. జీవన్‌రెడ్డి గుండెధైర్యంతో నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.జీవన్‌రెడ్డిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని వెల్లడించారు. ఆయన ప్రజాజీవితం ఎంతోమందికి ఆదర్శమని ప్రశంసించారు. జీవన్‌రెడ్డి చేరికతో బీఆర్ఎస్‌కు ఊపు వస్తోందన్నారు.జీవన్‌రెడ్డితో కలిసి అన్నదమ్ముల్లా పనిచేస్తామని వివరించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డికి తక్షణ బాధ్యతలు ఇస్తామని స్పష్టం చేశారు. కరీంనగరే కాదని.. చుట్టుపక్కల జిల్లాల్లోనూ జీవన్‌రెడ్డి పనిచేయాలని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవన్‌రెడ్డి కీలక బాధ్యతల్లో ఉంటారని పేర్కొన్నారు. తెలంగాణ పదాన్నే నిషేధించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. మన నీళ్లు, వనరులను దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. కొన్ని పార్టీల తీరుతో ఆవేశం, దు:ఖం వచ్చేదని చెప్పుకొచ్చారు. పాలమూరు లాంటి జిల్లాల్లో 90 శాతం వలసలే ఉన్నాయని ప్రస్తావించారు. గంజి కేంద్రాలు పెట్టిన అధ్వాన స్థితికి తెలంగాణను చేర్చారని తెలిపారు. కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. దారుణ పరిస్థితులు ఉండేవని అన్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు చంద్రబాబు కరెంట్ ఛార్జీలు పెంచారని చెప్పారు. కరెంట్



ఛార్జీలపై నిరసన తెలిపితే బషీర్‌బాగ్‌లో కాల్చి చంపారని విమర్శించారు. బషీర్‌బాగ్ ఘటనతోనే తెలంగాణ జెండా పట్టుకుని ఉద్యమం చేశానని ప్రస్తావించారు. బక్కపలచనోడు, ఇతనితో ఏమవుతుందని హేళన చేశారని గుర్తుచేశారు. మొక్కవోని దీక్షతో తెలంగాణ మొత్తం తిరిగి ఉద్యమించానని ఉద్ఘాటించారు. మాజీ సీఎం రోశయ్య 14ఈ జీవో తెస్తే ఉద్యోగ గర్జన చేపట్టామని ప్రస్తావించారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అంటూ దీక్ష చేపట్టానని తెలిపారు. తన దీక్షతో పార్లమెంట్ అల్లకల్లోలమైందని అన్నారు. మాజీ కేంద్రమంత్రి చిదంబరం వచ్చి తెలంగాణ ఇస్తామని ప్రకటన చేశారని తెలిపారు. ఆంధ్రోళ్ల ఒత్తిడితో మళ్లీ అడ్డంపడితే పోరాడామని చెప్పుకొచ్చారు. తెలంగాణ వచ్చాక అందరినీ కలుపుకుని ప్రణాళికతో ముందుకెళ్లామని అన్నారు. కాకతీయ రాజుల పేరుతో చెరువులు బాగుచేసుకున్నామని తెలిపారు. పదేళ్లలో ఎన్ని చేశామో మీరే చూశారని ప్రస్తావించారు. మిషన్ భగీరథ పూర్తికాకపోతే ఓట్లు వేయొద్దని అసెంబ్లీలోనే చెప్పానని అన్నారు. ఐదేళ్లలోనే మిషన్ భగీరథ పూర్తిచేసి మంచినీళ్లు ఇచ్చామని వ్యాఖ్యానించారు. ఇప్పుడు మిషన్ భగీరథకు ఏం రోగం పుట్టింది? అని ప్రశ్నించారు. ఇప్పుడు మిషన్ భగీరథ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ చావాలి అంటూ ఇప్పుడు మాట్లాడుతున్నారని అన్నారు. తాను విమర్శించే వారు వెయ్యి జన్మలెత్తినా తాను చావనని తెలిపారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా అని ఎద్దేవా చేశారు. చావాలంటూ మీరు శాపాలు పెడితే తాను చస్తానా? అని ప్రశ్నించారు. చివరి శ్వాస ఉన్నంతవరకు పనిచేస్తానని స్పష్టం చేశారు. ఇప్పుడు తెలంగాణలో కరెంట్ వస్తోందా? అని ప్రశ్నించారు. పంటపొలాలు ఎండిపోయి ప్రజలు ఏడుస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసేటప్పుడు ఉల్టాపల్టా కావొద్దని అప్పుడే చెప్పానని ప్రస్తావించారు. వీళ్లు రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జైభీమ్ అంటారని చెప్పానని అన్నారు. ఒక్కసారే వెయ్యాల్సిన రైతుబంధును ఒక్కో ఎకరానికి ఒకసారి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో మేం ఒకేసారి రైతుబంధు వేసేవాళ్లమని చెప్పుకొచ్చారు. వీళ్లు నోటికొచ్చిన మాటలు.. ఇష్టమొచ్చిన కథలు చెప్పారని అన్నారు. వీళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని.. ఇప్పుడు గోస పడుతున్నారని చెప్పారు. 1.7 శాతం ఓట్ల తేడాతోనే మనం ఓడిపోయామని ప్రస్తావించారు. మనవాళ్లు అటూ ఇటూ దూకినా తాను ఎక్కడా మాట్లాడలేదని అన్నారు.

తాము రూ.73 వేల కోట్ల రైతుబంధు ఇచ్చామని పేర్కొన్నారు. తమ హయాంలో ఎకరం రూ.2 కోట్ల నుంచి 3 కోట్లు ఉండేదని ప్రస్తావించారు. ఇప్పుడు అమ్మేవాళ్లు ఉన్నారు కానీ.. కొనేవాళ్లే లేరని చెప్పారు. యూరియా బస్తాలు కూడా ఇవ్వడం చేతకావడం లేదని మండిపడ్డారు. యాప్‌ల పేరుతో కాళ్లకు వాపులు తప్ప ఏమీ లేదని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభ పెడితేనే.. రెండోవిడత రైతుబంధు ఇస్తున్నారని తెలిపారు. మళ్లీ తాను సభ పెడితేనే మూడోవిడత రైతుబంధు ఇస్తారా..? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో హైడ్రాను తీసుకొచ్చారని.. నిజామాబాద్‌లోనూ తెస్తామని అంటున్నారని ప్రస్తావించారు. పేదల ఇళ్లను కూల్చివేయడమేనా? ఈ ప్రభుత్వ పని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తిపారేస్తామని అన్నారు. హైడ్రా ఎత్తివేతపైనే తన తొలి సంతకం ఉంటుందని స్పష్టం చేశారు. మూసీ కోసం వేల ఇళ్లు కూల్చేస్తారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని ఆరోపించారు. మూసీ సుందరీకరణ వద్దంటలేం.. కానీ.. పేదల ఇళ్లు కూల్చివేత దేనికి? అని నిలదీశారు. రైతులకు నష్టమనే మీటర్లు పెట్టేందుకు తాము ఒప్పుకోలేదని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి మోకరిల్లి మీటర్లు పెడుతున్నారని.. మీటర్ల ఏర్పాటుపై యుద్ధం చేస్తామని కేసీఆర్ హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఐపీఎల్ 2026లో ముంబై రెండో విజయం

మొదటి తరువాయి

తిలక్ వర్మ సూపర్ షో..

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్.. ఇన్నింగ్స్ ప్రారంభంలోనే వికెట్లు కోల్పోయింది. దానిష్ మలేవర్, క్వింటన్ డికాక్, సూర్యకుమార్ యాదవ్ స్వల్ప స్కోరుకే ఔట్ కావడంతో పవర్ ప్లే ముగిసే లోపే 3 వికెట్లు కోల్పోయింది. దీంతో మరోసారి ముంబై తక్కువ స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించింది. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్ వర్మ అద్భుతం చేశాడు.ఈ మ్యాచ్‌లో తొలి 20 బంతుల్లో కేవలం 17 రన్స్ మాత్రమే చేసిన తిలక్.. ఆ తర్వాత విశ్వరూపం చూపించాడు. ఆ తర్వాత 23 బంతుల్లో ఏకంగా ఏకంగా 82 పరుగులు స్కోరు చేశాడు. తన ఇన్నింగ్స్‌లో ఏకంగా 7 సిక్స్‌లు, 8 ఫోర్లు కొట్టాడు. మొత్తంగా 45 బంతుల్లో 101 పరుగులు చేశాడు. నమన్ ధీర్ 32 బంతుల్లో 45 రన్స్ చేశాడు. దీంతో ముంబై ఇండియన్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది.అనంతరం ఛేజింగ్‌కు దిగిన.. గుజరాత్ టైటాన్స్ వరుసగా వికెట్లు కోల్పోయింది. తొలి బంతికే సాయి సుదర్శన్ ఔట్ అయ్యాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క వికెట్ కూడా తీయని బుమ్రా.. ఈ మ్యాచ్‌లో మాత్రం తొలి బంతికే సుదర్శన్‌ను ఔట్ చేశాడు. జాస్ బట్లర్ (5), శుభ్‌మన్ గిల్ (14), గ్లెన్ ఫిలిప్స్ (6), రాహుల్ తెవాటియా (8) విఫలమయ్యారు. చివరకు గుజరాత్ టైటాన్స్.. 15.5 ఓవర్లలో 100 పరుగులకు ఆలౌట్ అయింది. ముంబై ఇండియన్స్ బౌలర్లలో అశ్వనీ కుమార్.. 4 ఓవర్లు వేసి 24 పరుగులు ఇచ్చి.. 4 వికెట్లు పడగొట్టాడు. ఘజన్‌ఫర్, మిచెల్ శాంట్నర్ రెండేసి వికెట్లు తీశారు. బుమ్రా, హార్దిక్ పాండ్యా ఒక్కో వికెట్ పడగొట్టారు.

# సంపాదకీయం

## వైదికవాదం దిశగా విద్యా విధానం!




2026 ఏప్రిల్ 11 జ్యోతిబా పూలే జయంతి. ఆయన అభిమానులు పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పాలకవర్గాలు ఈ అవకాశాన్నీ తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో లబ్ధికి వాడుకున్నాయి. మోడీ అన్ని దినపత్రికల్లో పూలేపై వ్యాసాన్ని రాశారు. పూలేలను పొగిడారు. వారి పద్ధతులే తన విధానాలని రాశారు. ఈ తాత్వికత విద్యాసంస్థలకూ పాకింది. నాగార్జున విశ్వవిద్యాలయం జ్యోతిరావు పూలే కేంద్రం కార్యక్రమంలో ఒకతను తన రచనను సమర్పించారు. "మోడీ ఆచరణలన్నీ జ్యోతిరావు పూలే కార్యక్రమాలే. ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేయడం, జాతీయ విద్యా విధానం-2020 సావిత్రిబాయి పూలే ప్రభావంతోనే" అన్నారు.

జియోవని జెన్టైల్ రోమ్ విశ్వవిద్యాలయ మతాచార్యుడు, ఊహావాద తత్వవేత్త. ఇటలి ఫాసిస్టు పార్టీ స్థాపకుడు, నియంత బెనిట్ అమిల్కేర్ ఆండ్రియా ముసోలిని మొదటి మంత్రివర్గంలో విద్యామంత్రి. జెన్టైల్ ఫాసిస్టులకు ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టారు. ముసోలిని ఇటలి విద్యావ్యవస్థను జెన్టైల్ సంస్కరణలతో సవరించారు. "మానవ జీవితం విజ్ఞానశాస్త్రానికి తెలియని ఆధ్యాత్మిక భావాలతో ఉంది. భావజాల నిర్మాణంలో విద్య, సంస్కృతి ప్రాథమికాలు. ఉపాధ్యాయ-విద్యార్థి భావఐక్యత ముఖ్యం. విద్యలన్నీ ఆత్మసేవలే. ఆత్మాభివృద్ధి సాధనాలే. ఆత్మవికాసానికి మతతాత్వికత అవసరం. పిల్లలకు పిన్నవయసులోనే మతాన్ని బోధించాలి. విజ్ఞానశాస్త్రాలను ఐచ్ఛికాంశాలుగా మార్చాలి."ఇవీ జెన్టైల్ భావాలు. జెన్టైల్ 21 తప్పుడు విశ్వవిద్యాలయాలను అధికారికంగా గుర్తించారు. ఫాసిస్టు విజయానికి విద్య ఆయుధమని ఇటలి ఫాసిస్టుల ఆలోచన. 6 మే1923న జెన్టైల్ మాధ్యమిక విద్యాచట్టాన్ని చేశారు. అందరికీ విద్య అనే ప్రజాస్వామ్య భావనను తొలగించారు. ఉపాధ్యాయుని బోధనా స్వేచ్ఛను నియంత్రించారు. మాధ్యమిక విద్యను రెండుగా చీల్చారు. ఉన్నతవర్గ విద్యలో లాటిన్, గణితం, భౌతికశాస్త్రం బోధిస్తారు. రెండవది విశ్వవిద్యాలయ ప్రవేశానికి, వృత్తి విద్యలకు పనికిరాని ద్వితీయశ్రేణి విద్య. బాలికలకు గణితం, విజ్ఞానశాస్త్రాలను బోధించరు. విశ్వ విద్యాలయాలను మూడుగా విభజించారు. ప్రథమశ్రేణిలో అన్ని విద్యావిభాగాలు ఉంటాయి. బోధన, పరిశోధన, జీతాలను ప్రభుత్వం చెల్లిస్తుంది. ద్వితీయ శ్రేణి విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వ సాయం తక్కువ. తృతీయశ్రేణిలో సొంత నిధులతో, ప్రభుత్వ ఆజ్ఞల ప్రకారం, ఉచిత విద్యను బోధించాలి. లేకుంటే ఈ విశ్వవిద్యాలయాలను రద్దుచేస్తారు.

జెన్టైల్ విధానంలో రాజ్యసిద్ధాంతాలనే బోధించాలి. రాజ్యా దేశాలే ప్రజాభిప్రాయాలు. ఒకే ఉపాధ్యాయుడు బహుళ తాత్వికతలను బోధిస్తాడు. తత్వశాస్త్రం ప్రధాన ఆలోచనావిధానం. అన్ని అంశాలకు అనుబంధం. దేవుడొక్కడే సూత్రంతో అన్ని జ్ఞానాలను విద్యార్థులు అభ్యసించాలి. ఈ నమ్మకాల పురుషులే అధ్యాపకులు. మగాళ్ల తయారీ విద్య లక్ష్యం. మగపిల్లలు (బాలికల ప్రస్తావన లేదు) గురువు నుండి ఆధ్యాత్మిక ప్రకాశాన్ని ఆశించాలి. ఇటాలియన్ తప్ప ఇతర భాషా మాధ్యమాలను నిషేధించారు. ఇతర మాతృభాషల పిల్లలు చదువు మానేశారు. స్వజాతి గొప్పది. పితృభూమి కోసం స్వీయబలికైనా సిద్ధపడాలి. విద్యార్థుల విధేయత బోధనలో సమ్మిళితం. విజ్ఞానశాస్త్రాల కంటే జాతీయత ముఖ్యం. గురువు బాహ్యప్రపంచ లక్షణాలను వదలాలి. విద్యార్థులకు దైవాకర్షణ, దైవీకరణ చట్రంలో పురాణాలను బోధించాలి. ఆధ్యాత్మిక సారం, క్రమశిక్షణ నేర్పాలి. వారి రూపురేఖలను మార్చాలి. ఉపాధ్యాయుల, విద్యార్థుల ఆధ్యాత్మిక జీవితాలు ఏకమైతేనే క్రమశిక్షణ, అధికారం పట్ల గౌరవం సాధ్యం. ఈ ఐక్యతాసాధనే గురువు కర్తవ్యం. ఆత్మ మనుషులను కలుపుతుందని నమ్మాలి. క్రైస్తవంతో ప్రకృతి నుంచి ఆత్మ విడివడింది. ప్రాకృతిక ప్రేరణ ఆధ్యాత్మిక లక్ష్యానికి అడ్డంకి. మతం, గణితం, ఆర్థికం మగాళ్లకే పరిమితం. చదువుకున్న మగాడే ఆత్మను గుర్తిస్తాడు. విద్యాలయ పవిత్రత, విద్యుక్త ధర్మాలను అనుభూతి చెందని మగాడు ఉపాధ్యాయునిగా అనర్హుడు. పరిశోధనలతో ఆత్మను పగులకొట్టరాదు. దృఢమైన ఆత్మతో భావపరాధీనతలను నిరోధించేదే ఆదర్శ విద్య. జెన్టైల్ ఫాసిస్టు విద్యావ్యవస్థకు ముసోలిని మద్దతిచ్చాడు. మతవాద ఉపాధ్యాయవర్గం, పత్రికలు ఈ సంస్కరణలను ఆహ్వానించాయి. ఫాసిస్టు పత్రిక సంపాదకుడు, కార్పొరేషన్ల పూర్వ మంత్రి గిసెప్ బొట్టాయి జెన్టైల్ సంస్కరణలను విమర్శించాడు. విద్యావేత్తలు, విజ్ఞానశాస్త్ర సంఘాలు వీటిని ఫాసిస్టు విధానాలన్నాయి. "ఈ విద్యావిధానంతో గ్రామీణ విద్యాలయాలు మూతపడతాయి. గ్రామీణ ప్రాముఖ్యత గల మన దేశంలో గ్రామీణుల ప్రగతి కుంటుబడుతుంది." అని 1923-24 విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తూ మాసెరట విశ్వవిద్యాలయ పీఠాధిపతి రికార్డో బాచి అన్నారు. జెన్టైల్ సంస్కరణలు ఆధునీకరణ, సాంకేతికాభివృద్ధికి ఆటంకాలని, పొరుగు దేశాలతో పోటీలో ఇటలి వెనుకబడుతుందని తర్వాతి ఇటలి విద్యామంత్రులు వాదించారు. ప్రగతిశీలురు, వామపక్షవాదులు ఇవి తప్పుడు విధానాలన్నారు. జెన్టైల్ సంస్కరణలు విద్యకు నష్టం కలిగించాయి. ఫాసిజాన్ని బలపర్చాయి. 1928 తర్వాత ఈ విద్యావిధానం బలహీనపడింది. 1882లో విద్యా కమిషన్ అధ్యక్షులు సర్ విలియం హంటర్‌కు జోతిబా సమర్పించిన వినతిపత్రంలోని అంశాలు -- విద్య ప్రభుత్వ అధీనంలో ఉండాలి. ప్రాథమిక విద్యను తప్పనిసరి చేయాలి. వంచిత శిశువులకు విద్యనందించాలి. విద్యకు స్త్రీలను ప్రోత్సహించాలి. భారతీయుల అవసరాల అంశాలతో విద్య ఉండాలి. వ్యవసాయాన్ని బోధనాంశాల్లో చేర్చాలి. దిగువ స్థాయి పిల్లలకు విద్యను అందించడానికి అడ్డంకులు కల్పిస్తున్న 'వడబోత సిద్ధాంతాన్ని' తొలగించాలి. (వడబోత విద్యా సిద్ధాంతాన్ని బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెని విద్య, న్యాయ శాఖ మంత్రి లార్డ్ మెకాలే 1835 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టారు. దీని ప్రకారం కొద్దిమంది అనుకూల ఉన్నత కులాల వారికి ప్రభుత్వం చదువు చెపుతుంది. వీళ్లు తక్కువ కులాలవారికి విద్యను అందిస్తారు) బడుగుల పిల్లలు బడి మానడానికి వారి సామాజిక స్థితులు, పేదరికం కారణాలు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి విద్యలో వృత్తి నైపుణ్యతలు బోధించాలి. ఉపాధ్యాయులు సుశిక్షితులయి ఉండాలి. కింది తరగతుల పిల్లలకు కింది తరగతి ఉపాధ్యాయులే విద్య నేర్పాలి. ఉపాధ్యాయులకు వ్యవసాయ, ఆరోగ్య, పరిశుభ్రతల కనీస సమాచారం ఉండాలి. గ్రామీణ ఉపాధ్యాయులకు జీతంతో పాటు విద్యార్థుల ఉత్తీర్ణత, సామర్థ్యాలను బట్టి ప్రత్యేకభత్యం ఇవ్వాలి. వ్యవసాయదారుల పిల్లలకు విద్యలో రాయితీలివ్వాలి. పేదలు, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఉచిత గృహవసతి కల్పించాలి. ఈ సూచనలను జ్యోతిబా తమ పాఠశాలల్లో అమలుచేశారు. విలువలతో కూడిన జీవిత, నీతి, నియమ నిబద్ధతల విద్య నేర్పారు. 2020-జాతీయ విద్యావిధానం జెన్టైల్ విద్యాసంస్కరణల సారాంశం. విద్యను ధార్మికసంస్థలకు అప్పజెప్పాలని ప్రతిపాదించారు. నేటి పాలకుల దృష్టిలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను మించిన ధార్మికసంస్థ లేదు.

# మల్లేపల్లి లో ఘనంగా నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

**దేవరకొండ ఏప్రిల్ 20( మహాప్రభ)**
నియోజకవర్గంలోని మల్లేపల్లి లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను తెలుగుదేశం పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇన్చార్జ్ వస్కుల కృష్ణయ్య ఆదేశాల మేరకు మల్లేపల్లి మండల కేంద్రంలో ఎచీూఖీ నల్గొండ పార్లమెంట్ అధ్యక్షుడు వస్కుల రాజేష్ ఆధ్వర్యంలో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వస్కుల రాజేష్ పార్టీ కార్యకర్తలు, విద్యార్థి నాయకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎచీూఖీ నల్గొండ పార్లమెంట్ అధ్యక్షుడు వస్కుల రాజేష్ మాట్లాడుతూ: "అపర చాణక్యుడు, విజన్ 2047 సృష్టికర్త నారా చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన మహోన్నత




నాయకుడు ఆయన. ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థి, యువతకు ఆయన ఎప్పుడూ ఒక స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారు అని అన్నారు ఈ కార్యక్రమంలో నర్సర్లపల్లి యువ నాయకుడు కటమోని వెంకటేష్ , యూత్ అధ్యక్షుడు పెరికేటి శ్రీనివాస్ చారి , బనావత్ కిషన్ నాయక్ , శ్రీకాంత్ చారి, అనిల్, ఫయాజ్, లాలు, శ్రీను, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ఆశీర్వదించిన అసెంబ్లీకీ రావాలి.!

**కూకట్పల్లి, ఏప్రిల్ 20 (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైన వేదిక అసెంబ్లీ. ప్రజల సమస్యలను చర్చించాల్సిన, ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రతిపక్షం పైన ఉంటుంది. అయితే ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా, కేవలం బహిరంగ సభలకు మాత్రమే పరిమితమవుతున్న తీరు తీవ్రంగా ఖండనీయము.ప్రజల ద్వారా ఎన్నుకోబడిన ప్రతినిధిగా, ముఖ్యంగా ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి రావడం ఆయన రాజ్యాంగబద్ధ బాధ్యత. ప్రజల సమస్యలు, రైతుల ఇబ్బందులు, యువత నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి కీలక అంశాలపై అసెంబ్లీలో చర్చించకుండా, బయట సభల్లో రాజకీయ వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడం



కాదా? బహిరంగ సభల్లో ప్రభుత్వాన్ని విమర్శించడం సులభం. కానీ అసెంబ్లీలో వాస్తవాలు, గణాంకాలతో మాట్లాడాల్సిన బాధ్యతను తప్పించుకోవడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. ఇది బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.కాంగ్రెస్ పార్టీ తరఫున మేము స్పష్టం చేస్తున్నాము --- ప్రతిపక్ష నేతగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు వెంటనే అసెంబ్లీకి హాజరై, ప్రజల సమస్యలపై చర్చించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవిస్తూ తన బాధ్యతలను నిర్వర్తించాలి. లేకపోతే, ఇది ప్రజల తీర్పును అవమానించినట్టే అవుతుంది. తెలంగాణ ప్రజలు నిజాలను గమనిస్తున్నారు, సమయానుకూలంగా తగిన తీర్పు ఇస్తారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి.

**-రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి.**

**మెదక్ జిల్లా -20ఏప్రిల్ (మహాప్రభ,).**
ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ రాష్టంలో త్వరలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమములో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఓటర్ల



జాబితాను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు ప్రతి ఇంటింటిని సందర్శించి వివరాలు సేకరించాలని తెలిపారు. గ్రామాలలో సెర్ప్ సిబ్బంది, మున్సిపాలిటీలలో మోప్మా సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని, సెర్ప్, మోప్మా సిబ్బందితో ఓటరు జాబితాపై ప్రత్యేక సమగ్ర సవరణపై విస్తృత ప్రచారం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో మ్యాపింగ్ చేసుకునేలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో స్పష్టమైన జాబితా రూపకల్పన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద తండాలో పోషణ పక్షం విజయవంతం

**ICDS, CDPO చంద్రకళ, సూపర్వైజర్ చిట్టెమ్మ**

**దేవరకొండ ఏప్రిల్ 20( మహాప్రభ)**
సోమవారం పోషణ పక్షంలో భాగంగా sheripally pedda thanda Anganwadi centres నందు



గర్భిణీలు బాలింతలు మరియు పిల్లలు తీసుకోవలసిన పోషక విలువల గురించి జణూా చంద్రకళ వివరించడం జరిగింది, పరిసరాలలో దొరికే కాయగూరలు ఆకుకూరలు సీజనల్ పండ్లు సిరి ధాన్యాలు ,చిరు ధాన్యాలు తప్పకుండా తీసుకోవాలని పిల్లలతో ఎక్కువగా మాట్లాడితే మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతున్నదని మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసులో ఆటలు పాటలు కథలు సంభాషణ ద్వారా పిల్లల మెదడు అభివృద్ధి .. కావున ఈ వయసులో పిల్లలకు ఆటపాటలతో విద్యను అందించాల్సిన అవసరం చాలా ఉంది అని తెలియజేశారుఈ విషయంలో తల్లిదండ్రులు ఇంటి వద్ద మరియు అంగన్వాడీ టీచర్ స్కూల్లో పిల్లలకు ఎక్కువగా నేర్చుకునే అవకాశాలను కల్పించడం ద్వారా వాళ్లు అభివృద్ధి మైలురాళ్లను చేరుకుంటారని తెలియజేశారు,సూపర్వైజర్ డి చిట్టెమ్మ మాట్లాడుతూఇప్పుడు గర్భిణీ స్త్రీలు, బాలింత తల్లులు, చిన్నపిల్లలు, వృద్ధులు ,ఎక్కువగా ఎండలు ఉండటం వల్ల తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అని తెలియజేశారు. . ఈ కార్యక్రమంలో సర్పంచ్ భావు సింగ్ , పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, ప్రైమరీ స్కూల్ టీచర్ సామ్రాజ్యం,అంగన్వాడి టీచర్స్ శాంతాబాయి, పద్మ,సునీత, తల్లులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# నూతన చలివేంద్రం ఏర్పాటు



**శివంపేట, ఏప్రిల్ 20 (మహాప్రభ):**
శివంపేట్ మండలం, కొంతాన్ పల్లి గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి చింతల విజయ వెంకట్రాంరెడ్డి గారు ప్రారంభించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా మండిపోతున్న నేపథ్యంలో గ్రామంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ గారు తెలిపారు. గ్రామ ప్రజలు ఎండల నుండి రక్షణ పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాధిక గారు, గ్రామ ఉపసర్పంచ్ బొల్లారం కుమార్, వార్డు సభ్యులు ఉప్పరి సంతోష్, సారా శంకర్ లాల్, గుండు వేణుగోపాల్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, వేసవికాలంలో ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

# 'స్వీపింగ్ మెషిన్' పునఃప్రారంభం

**మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు**



**దేవరకొండ ఏప్రిల్ 20( మహాప్రభ)**
మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి పున్న శైలజ వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో పట్టణంలోని ప్రధాన రహదారులను శుభ్రపరిచే 'స్వీపింగ్ మెషిన్' సోమవారం నుండి తిరిగి రోడ్డెక్కింది. గత కొంతకాలంగా వినియోగంలో లేని ఈ యంత్రాన్ని, పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఆమె మళ్ళీ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ...ప్రధాన రహదారులపై పేరుకుపోయిన ధూళి, చెత్తను వేగంగా తొలగించడానికి ఈ మెషిన్ ఎంతో జోహార పడుతుందని అన్నారు. రోడ్ల శుభ్రతకు యంత్రాన్ని వాడటం వల్ల, అక్కడ పనిచేసే పారిశుధ్య సిబ్బందిని ఇతర వార్డుల్లోని అంతర్గత వీధుల శుభ్రతకు కేటాయించే అవకాశం ఉంటుందని అన్నారు దీనివల్ల పట్టణమంతా ఏకకాలంలో పరిశుభ్రంగా మారుతుంది. అందుబాటులో ఉన్న అన్ని వనరులను, సాంకేతికతను ఉపయోగించుకుంటూ పట్టణాన్ని ఆదర్శవంతంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే మా ప్రథమ ప్రాధాన్యత అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ గౌడ్, గుత్తే జవాన్లు మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# డివిజన్ అభివృద్ధే లక్ష్యం

**-కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి ఏప్రిల్ 20(మహాప్రభ )**
శేరిలింగంపల్లి డివిజన్‌లోని కేఎంఆర్ ఎస్టేట్స్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. రూ. 62.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులకు పిఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ తో కలిసి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ, స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ఈ పనులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అత్యవసరం ఉన్న ప్రాంతాలు, నిత్యం నీరు నిలిచే ప్రాంతాలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి సమస్యల రహిత ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎవీఔూడాదీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, జీఎం కృష్ణ, డీజీఎం శ్రీహరి, మేనేజర్ సందీప్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, కేఎంఆర్ ఎస్టేట్స్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బాబిరెడ్డి, సెక్రటరీ వేణుబాబు, గనస్యం నాగేశ్వరరావు, శ్రీహర్ష, రవికుమార్, పర్వతాలు, సుకుమార్, శ్రీనివాసరావు, గౌతమ్ శ్యామ్, ప్రమోద్, ప్రవీణ్, సత్య, అలేఖ్య, అనూష, మౌనిక, లక్ష్మి, ప్రియాంక, మల్లేష్, పవన్, సాయి తదితర స్థానికులు పాల్గొన్నారు.

## రిలైఫ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్





**దేవరకొండ ఏప్రిల్ 20( మహాప్రభ )**
హైదరాబాద్ లోని దీచీ రెడ్డి దగ్గర ఏర్పాటు చేసిన రిలైఫ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సహచర ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి తో కలిసి పాల్గొని, రిలైఫ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్ను ప్రారంభించి, హాస్పిటల్ యజమానికి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రద్దగుంట గ్రామంలో పక్షవాతంతో 18 నెలల నుండి మంచానపడ్డ దిండు సుబ్రహ్మణ్యం

**-వీధన పడ్డ కుటుంబం, దాతల కోసం ఎదురుచూపు**



**ఏప్రిల్ 20 తిరుపతి జిల్లా (తడ మండలం) మహాప్రభ**
తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గండవరం రమేష్ రెడ్డి చొరవతో ఆర్థిక సాయం తిరుపతి జిల్లా తడ మండలం గ్రద్దగుంట గ్రామంలో గత 18 నెలల నుండి పక్షవాతంతో మంచానపడ్డ దిండు సుబ్రహ్మణ్యం ను తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గండవరం రమేష్ రెడ్డి తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల గురవం బాబు సహకారంతో దిండు సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లి వాళ్ళ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దిండు సుబ్రహ్మణ్యం కు మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని సిమ్స్ హాస్పిటల్ కు వెళ్లాలని అందుకుగాను కాంగ్రెస్ పార్టీ దిండు సుబ్రహ్మణ్యం కు అండగా ఉంటుందని, కంగన్ ఎనర్జిటిక్ వాటర్ 5 లీటర్ల క్యాన్ ప్రతిరోజు అందజేస్తామని, అధికారులతో మాట్లాడి పెన్షన్ వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని ధైర్యం చెప్పి, ఆర్థికంగా ఆదుకొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా, తడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కో-ఆప్షన్ సభ్యుల కోసం దరఖాస్తును మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి అందజేసిన అభ్యర్థులు.



**మెదక్ జిల్లా,-20 ఏప్రిల్ (మహాప్రభ )**
మెదక్ మున్సిపల్ కార్యాలయంలో కో-ఆప్షన్ సభ్యుల నియామకానికి సంబంధించిన దరఖాస్తులను అభ్యర్థులు మున్సిపల్ కమీషనర్ కు సమర్పించారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజ్, పట్టణ పార్టీ అధ్యక్షులు మందుగుల. గంగాధర్, కౌన్సిలర్ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన గౌరీచర్ల అనూష దరఖాస్తును మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్,పట్టణ పార్టీ అధ్యక్షులు, మందుగుల. గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్,నాయకులు మ్యాడం బాలకృష్ణ,కౌన్సిలర్లు.గంట సంపత్ ఏండి.మన్సూర్, శివరామకృష్ణ,హరిత నర్సింగ్ రావు, ముత్యం గౌడ్, మాజీ కౌన్సిలర్ గేలెన్,మరియు జాయిముర్రే, క్రాంతి దీప్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల సందర్శన







**తాడ్వాయి, ఏప్రిల్ 20 (మహాప్రభ):**
ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా తాడ్వాయి మండల ఎంపీడీఓ, సవిత రెడ్డి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, అనే విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఆహారం నాణ్యత, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా, పాఠశాల పూర్వ విద్యార్థులను ఆహ్వానించి ప్రస్తుత విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు భవిష్యత్‌పై స్పష్టత, ప్రేరణ లభిస్తుందని తెలిపారు.

## ఫార్మేషన్ రోడ్డును పరిశీలించిన మండల అధికారి కృష్ణ గౌడ్




**తాడ్వాయి ఏప్రిల్ 20 (మహా ప్రభ)**
కన్కల్ గ్రామ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ఫార్మేషన్ రోడ్డును, మండల అధికారులు కృష్ణ గౌడ్, ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణగౌడ్, స్థలాన్ని సందర్శించి జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. రోడ్డు నిర్మాణం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందించడమే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకుంటూ, సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు పూర్తయితే గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు ఫిల్డ్ అసిస్టెంట్, రాజు, మెట్లు, మనోహర్, స్వామి, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## శంకర్ నాయక్ ను పరామర్శించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 20( మహాప్రభ )**
దేవరకొండమండలంలోని మైనంపల్లి కొర్ర తండాకు చెందిన శంకర్ నాయక్ రోడ్డు ప్రమాదంలో గాయలై హైదరాబాద్ లోని సాగర్ కాంప్లెక్స్ దగ్గర బృంగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని నేడు హైద్రాబాద్ లోని బృంగి ఆసుపత్రికి చేరుకోని శంకర్ నాయక్ నుపరామర్శించి,వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులకు ఆయన సూచించారు. అనంతరం కంబాలపల్లి యాదయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని దీచీ రెడ్డి లైఫ్ కేర్ ఆసుపత్రికి చేరుకొని యాదయ్య ను పరామర్శించారు. వారితో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, యువ నాయకుడు ముచ్చర్ల శ్రీకాంత్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నల్ల సంజీవ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా అన్నదానం కార్యక్రమం



**శేరిలింగంపల్లి ఏప్రిల్ 20(మహాప్రభ )**
తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల సంజీవ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మయూరి నగర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్‌లో ఉన్న హైదరాబాద్ జిల్లా మహిళా మండలుల సమాఖ్య ప్రాంగణంలో శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి అన్నదానం కార్యక్రమంలో పాల్గొని, వారిని శాలువాలతో సత్కరించి, నల్ల సంజీవ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేందర్ గౌడ్, కృష్ణ ముదిరాజ్, మన్నేపల్లి సాంబశివరావు, మోహన్ రెడ్డి, తిరుపతి, ప్రభాకర్ రెడ్డి, కట్ల శేఖర్ రెడ్డి, కృష్ణ గౌడ్, రాంచందర్, రవి, రెహమాన్, శివ, విష్ణు, శివ కుమార్, వాసు, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు సంగీత గౌడ్, శ్రీదేవి, అనిత, శశిరేఖ, శ్రీజ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కార్మికులు ఐక్యంగా పోరాడాలి




**దేవరకొండ ఏప్రిల్ 20( మహాప్రభ)**
దేవరకొండలో నిర్వహించిన CITU కన్వినింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం డి సలీం పాల్గొని కార్మికుల హక్కుల రక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. గత కొంతకాలం నుండి పెండింగ్ లో ఉన్న కార్మిక సమస్యల పరిష్కారానికి త్వరలో కార్యచరణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, యాదగిరి, కమిటీ సభ్యులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారుద.

# మౌలిక సదుపాయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్‌పల్లి, ఏప్రిల్ 20 (మహాప్రభ):** శేర్లింగంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు తప్ప ప్రస్తుతం కొత్తగా ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదని అన్నారు. నిర్మాణం కంటే కూల్చివేతలకే ప్రాధాన్యం ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. పార్టీ నాయకులు వార్డుల వారీగా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. నగరంలో మంచినీటి సమస్య, రోడ్ల దుస్థితి, పెరుగుతున్న దోమల బెడద కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. మీకు కావాలంటే నేను దీనిని షార్ట్ న్యూస్ వెర్షన్, పేపర్ కాలమ్ స్టైల్, లేదా బ్రేకింగ్ న్యూస్ ఫార్మాట్ లో కూడా రెడీ చేసి ఇస్తాను.

# నూతన గృహప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు





**శివంపేట ఏప్రిల్ 20(మహాప్రభ):** నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండలం చెన్నాపూర్ గ్రామానికి చెందిన మరికంటి అశోక్ ఌ ప్రశాంతి ఎనిమిదో వార్డ్ మెంబర్ సభ్యురాలు దంపతులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన 5 లక్షల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. సోమవారం రోజున గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యాతిథులుగా మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి, మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ పాల్గొని గృహప్రవేశం చేసి వారికి పట్టు వస్త్రాలు పెట్టి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...."ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్నారు., ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్, మాజీ ఎంపిటిసి మన్నె నర్సింలు, మార్చి నూరి శ్రీశైలం యాదవ్,సింగిరెడ్డి రాజిరెడ్డి, సింగిరెడ్డి అంజిరెడ్డి, గ్రామ అధ్యక్షులు బోయిని రవీందర్ యాదవ్, సిరిపురం నాగభూషణం, సిరిపురం కృష్ణ, బోయిని నాగరాజు, వాడు సభ్యులు వరలక్ష్మి రాములు, ఈట బోయిన మల్లేశా, బొల్ల బిక్షపతి ప్రముఖ వ్యాపారవేత్త వైన్స్ బొమ్మల సత్తయ్య, వెంకయ్య తాండ సర్పంచ్ బానోత్ వినోద్, మురళీధర్ రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా బదిలీ పై వచ్చిన అదనపు యస్పి విక్రాంత్ కుమార్ సింగ్.



**మెదక్ జిల్లా -20ఏప్రిల్ (మహాప్రభ,).** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి బదిలీపై మెదక్ జిల్లాకు వచ్చిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ కి జిల్లా పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గార్డ్ ఆఫ్ ఆనర్‌ను స్వీకరించారు. అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమై జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితులపై జిల్లా అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల భద్రత, చట్టసంరక్షణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ చిన్నారులకు 'గ్రాడ్యుయేషన్ డే'

-విద్యార్థులకు అక్షరాభ్యాసం





**గాంధారి, ఏప్రిల్20 (మహా ప్రభ)** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం బ్రాహ్మణపల్లి లో సోమవారం అంగన్వాడీ చిన్నారులకు 'గ్రాడ్యుయేషన్ డే' వేడుక నిర్వహించారు. అంగన్వాడీలో అక్షరాభ్యాసం పూర్తి చేసుకుని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే పిల్లలకు ఐసీడీఎస్ సూపర్వైజర్ భారతి, గ్రామ సర్పంచ్ గణేష్, చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచే పిల్లలకు ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలని సూచించారు.

## గురు పీఠంలో నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం





**శివంపేట, ఏప్రిల్ 20 (మహాప్రభ):** శివంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలోని గురు పీఠంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను గురు పీఠం వ్యవస్థాపకులు పెద్దగోని శివకుమార్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్లాంట్‌ను ప్రజలకు అంకితం చేశారు.

ప్రారంభ కార్యక్రమానికి సర్పంచ్ బ్యాగరి నరసయ్య ,మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, టిఆర్ఎస్ నాయకులు యాదగౌడ్ , జిన్నారం శ్రీనివాస్ గౌడ్ జిన్నారం పెద్దగోని సూర్యం, ఉష గొని శంకర్, బిక్షపతి, వంజరి కొండల్ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్లాంట్‌లోని యంత్రాంగాన్ని పరిశీలించి, శుద్ధి చేసిన నీటిని ఎలా సరఫరా చేస్తారో వివరాలు తెలుసుకున్నారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జన్మదిన వేడుకలు






**నకిరేకల్, ఏప్రిల్ 20 (మహాప్రభ):** నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జన్మదిన వేడుకలు రామన్నపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సుభాస్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ చిరుమర్తి లింగయ్య ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కునూరు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## వడగండ్ల వానతో వరి పంట నష్టం.. రైతుల ఆవేదన





**శివంపేట, ఏప్రిల్ 20(మహాప్రభ)** శివంపేట మండలం పరిధిలోని కొంతానుపల్లి గ్రామంలో ఆదివారం కురిసిన వడగండ్ల వానతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట కోతకు సిద్ధమైన సమయంలో అకాల వర్షం కురవడంతో పంట నేలపాలైంది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితిని తెలుసుకున్న మాజీ్రాూజూ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి రైతుల పొలాలను సందర్శించి నష్టాన్ని పరిశీలించారు. పంట నష్టంతో బాధపడుతున్న రైతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే వ్యవసాయ అధికారి (ఏవో) లావణ్య కూడా పంట పొలాలను పరిశీలించి నష్ట శాతాన్ని నమోదు చేశారు. నష్టపోయిన తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా జరిగింది గ్రాడ్యుయేషన్ డే



**దేవరకొండ ఏప్రిల్ 20( మహాప్రభ )** ఈ రోజు సాయంత్రం దేవరకొండలోని స్థానిక SPR SEMI RESIDENTIAL SCHOOL నందు 5వ, తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ పొట్టుముత్తు మహేశ్వర గారు మాట్లాడుతూ ప్రైమరీ విద్యను పూర్తి చేసుకొని ఉన్నత స్థాయి విద్యకు వెళుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి హై స్కూల్ విద్య పై అవగాహన కల్పిస్తూ మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యను అందిస్తామని, వారిని తీర్చి దిద్దుతామని దీనికి తల్లిదండ్రుల సహాయ సహకారాలు కూడా అవసరమని గుర్తు చేస్తూ దిశానిర్దేశం చేయడం జరిగింది. అదే విధంగా ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆశ్చర్య పరిచాయి. తల్లిదండ్రులకు గేమ్స్ నిర్వహించి గెలుపొందిన తల్లి దండ్రులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఆకారం అరుణ , డైరెక్టర్లు వస శ్రావణ కుమార్, చెన్నూరి లింగం, వైద్యుల కృష్ణమూర్తి, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇంత ఘనంగా కార్యక్రమాన్ని నిర్విహించుటకు సహకరించిన అందరికీ పాఠశాల ప్రిన్సిపల్ పొత్తుముత్తు మహేశ్వర్ గారు కృతజ్ఞతలు తెలిపారు.

## భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతుల మహా ధర్నా

-అధికారుల నిర్లక్ష్యమా

-యూరియా యాప్ ను వెంటనే తొలగించాలి




**గాంధారి ఏప్రిల్ 20 మహా ప్రభ** కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు నిరసన రోడ్డెక్కిన రైతులు, భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు మాట్లాడుతూ.. ఇదివరకే తహశీల్దార్, మార్క్‌ఫెడ్ అధికారులకు, కలెక్టర్?కు వినతి పత్రాలు అందించామని.. అయినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదన్నారు. దీంతో గతిలేని స్థితిలో రోడ్డుపై ధర్నా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు ప్రభుత్వం ధర రూ.2,400 నిర్ణయిస్తే.. దళారులు రూ.1,700 నుంచి కొనుగోలు చేస్తున్నారని వివరించారు. అంతేకాకుండా జొన్నకు ప్రభుత్వం రూ.3,700 ఉండగా దళారులు రూ.2,600 కొనుగోలు చేస్తున్నారని రైతన్నలు వాపోయారు. యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవడం సామాన్య రైతులకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సొసైటీల ద్వారా రైతులకు సరిపడా యూరియాను నేరుగా సరఫరా చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు రైతులు కోరారు.

# బిజినెస్

## లాభాల నుంచి నష్టాల్లోకి..
## సూచీలకు ఒడిదుడుకులు..




పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ సూచీలు ఆరంభ లాభాలను కోల్పోయాయి. క్రూడాయిల్ ధరలు పెరగడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతల నేపథ్యంలో సూచీలు లాభనష్టాలతో దోబూచులాడాయి. ఉదయం లాభాలతో ప్రారంభమై చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠంతో పోల్చుకుంటే 400 పాయింట్లను కోల్పోయింది .గత సెషన్ ముగింపు (78,493)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం 100 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ లాభ నష్టాలతో దోబూచులాడింది. చివరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తడంతో కిందకు దిగి వచ్చింది. చివరకు సెన్సెక్స్ 26 పాయింట్ల లాభంతో 78,520 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 11 పాయింట్ల లాభంతో 24,364 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో ట్రెంట్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్, యూనో మిండా, భెల్, జఎస్‌డబ్ల్యూ స్టీల్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. ఐఈఎక్స్, పీఐ ఇండస్ట్రీస్, గాడ్‌ఫ్రే ఫిలిప్, సోనా బీఎల్‌డబ్ల్యూ, ఎస్బీఐ కార్డ్ మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 16 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 107 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 93.12గా ఉంది

## భారీగా తగ్గిన బంగారం ధరలు..
## వెండిపై ఎంతంటే..!

సోమవారం 9.30 గంటల సమయంలో తులం బంగారంపై భారీగా తగ్గింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై 490 రూపాయలు తగ్గి ప్రస్తుతం రూ.1,55,290 వద్ద కొనసాగుతోంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాములపై 360 రూపాయలు తగ్గి ప్రస్తుతం రూ.1,42,350 వద్ద ట్రేడవుతోంది.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,290 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,350 ఉంది. అలాగే కిలో వెండి ధర రూ.2,79,900 వద్ద ట్రేడవుతోంది.ఇక వెండి విషయానికొస్తే..అతి స్వల్పంగానే తగ్గుముఖం పట్టింది. కేవలం 100 రూపాయలు మాత్రమే తగ్గి ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,74,900 వద్ద కొనసాగుతోంది. అదే హైదరాబాద్, చెన్నై, కేరళ ప్రాంతాల్లో కాస్త ఎక్కువగా ఉంది. ఇక్కడ రూ.2,74,900 వద్ద ట్రేడవుతోంది.అదనపు ఛార్జీలు:



పైన పేర్కొన్న ధరలు బులియన్ మార్కెట్ ధరలు మాత్రమే. మీరు నగలు కొనుగోలు చేసేటప్పుడు వీటికి +జీ (3%), మేకింగ్ ఛార్జీలు (తరుగు) అదనంగా ఉంటాయని గుర్తుంచుకోండి.ధరల మార్పు: అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ విలువపై ఆధారపడి ధరలు రోజులో ఎప్పుడైనా మారవచ్చు. కొనుగోలు చేసే ముందు స్థానిక జ్యువెలరీ షాపులో ఒకసారి సరిచూసుకోవడం మంచిది.గుర్తించుకోవాల్సిన విషయం ఏంటంటే మీరు ఈరోజు బంగారం కొనాలనుకుంటే హాల్‌మార్క్ ఉన్న నగలను మాత్రమే ఎంచుకోండి. ఇది మీరు కొనే బంగారం నాణ్యతకు గ్యారెంటీ ఇస్తుంది.

## వాట్సప్‌లో సబ్‌స్క్రిప్షన్ మోడల్.. ఈ ఫీచర్లు వాడాలంటే డబ్బులు కట్టాల్సిందే..

యూజర్ల కోసం వాట్సప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను ప్రవేశపెడుతూ ఉంటుంది. అందులో భాగంగా మరో కొత్త ఫీచర్ తీసుకురాబోతుంది. అదేంటంటే.. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ తరహాలో సబ్‌స్క్రిప్షన్ ఫీచర్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం టెస్టింగ్ దశలో ఇది ఉండగా.. త్వరలో ప్రవేశపెట్టనుంది. ఈ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నవారికి ప్రీమియం ఫీచర్లు అందుబాటులోకి వస్తాయి. యాప్‌లో మరిన్ని థ్రిల్లింగ్ ఫీచర్లను ఉపయోగించుకోవాలనుకునేవారికి ఇది ఉపయోగపడుతుంది.వాట్సప్ ప్లస్ పేరుతో ఈ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించనుంది. ఇందులో భాగంగా అదనపు ఫీచర్లను జోడించనుంది. ఈ సబ్‌స్క్రిప్షన్ అనేది కేవలం ఆప్షనల్ మాత్రమే. అవసరం అనుకుంటే తీసుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న ఫీచర్లు అన్నీ ఉచితంగా అందించనుంది. వినియోగదారులు దీని గురించి ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదు.మెస్సేజ్, వాయిస్ కాల్స్, వీడియో కాల్స్ లాంటి ప్రస్తుతం ఉన్న ఉచిత ఫీచర్లన్నీ ఎప్పటిలాగే



కొనసాగుతాయి. అయితే సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నవారికి అదనంగా కొన్ని ప్రీమియం ఫీచర్లు అందుతాయి. యానిమేటెడ్ ఎఫెక్ట్‌లతో కొత్త స్టిక్కర్ల ప్యాక్‌లు, 20 వరకు పిన్ చేసిన చాట్‌లు, యాప్ కోసం 18 కొత్త థీమ్ కలర్స్, కస్టమ్ యాప్ ఐకాన్లు, కాల్స్ కోసం ప్రత్యేక రింగ్ టోన్లు వంటి ఫీచర్లు ఉంటాయి.ఇక సెట్టింగ్స్‌ను ఒకే అనేక చాట్‌లకు వర్తింపచేసే సౌకర్యం అందుబాటులో ఉంది.ఈ వాట్సప్ ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధర ఒక్కో దేశంలో ఒక్కోలా ఉంటుంది. యూరప్‌లో నెలకు 2.49 యూరోస్‌గా ఉంది. ఇక మెక్సికోలో 29 డాలర్లుగా ఉంది. అంటే భారత కరెన్సీలో రూ.2610గా ఉంది. బిల్లింగ్ నెలవారీగా ఉంటుంది. ఆటో రెన్యూవల్ ప్రతీ నెలా చేసుకోవచ్చు.ఇక సబ్‌స్క్రిప్షన్ వద్దనుకుంటే ఎప్పుడైనా రద్దు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను పరీక్షిస్తుండగా.. కస్టమర్ల నుంచి వచ్చే ఫీడ్ బ్యాంక్ ఆధారంగా భవిష్యత్తులో మరిన్ని ఫీచర్లను జోడించవచ్చు. ఆండ్రాయిడ్ వినియోగదార్లకు మాత్రమే ఈ సబ్‌స్క్రిప్షన్ ఫీచర్ అందుబాటులో ఉంటుంది. ఐఓఎస్ వెర్షన్‌కు భవిష్యత్తులో తీసుకురానున్నారు.

## టీమ్ఇండియాలో చోటు కోసం పెరిగిన పోటీ

ఐపీఎల్ వచ్చినప్పటి నుంచి టీమ్ఇండియాలో చోటు కోసం పోటీ ఎక్కువైంది. ఈ దేశవాళీ టోర్నీమెంట్?లో రాణించి అనేకమంది కుర్రాళ్లు తమ సత్తాను ప్రపంచానికి చాటుకున్నారు. దీంతో ఆయా ప్లేయర్లను జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. అయితే ఇది సెలక్టర్లకు సవాల్ గా మారింది. ఎవరిని ఎంపిక చేయాలి అనేది కష్టంగా మారింది. ఒక్కోసారి ఈ విషయంలో సెలక్షన్ కమిటీ పలుమార్లు విమర్శలు ఎదుర్కొంటోంది. అందుకే బీసీసీఐ కొత్త ప్లాన్ చేస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.ప్రస్తుతం ఫామ్ లో ఉన్న ఆటగాళ్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అందుకే 30 నుంచి 35 మంది ఆటగాళ్లతో రెండు టీ20 జట్లు తయారు చేయాలని బీసీసీఐ ఆలోచిస్తుంది. ఈ మేరకు సెలక్షన్ కమిటీ ఓ జాబితా తయారు చేస్తున్నందని టాక్ వినిపిస్తుంది. దీంతో ఒకే సమయంలో మన రెండు జట్లు వేర్వేరు ప్రత్యర్థులతో ఒకేసారి బరిలో దిగవచ్చు. ఈ విధంగా బీసీసీఐ ప్లాన్ చేస్తుంది. అటు అంతర్జాతీయ ద్వైపాక్షిక సిరీస్ లు, మరోవైపు ఆసియా గేమ్స్ లాంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు ఒకేసారి ఆడేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందులో ఒక జట్టుకు ఎప్పటిలాగే సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ గా ఉంటాడు. ఇంకో జట్టుకు శ్రేయస్ అయ్యర్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.




'ఆసియా క్రీడలు, వెస్టిండీస్‌తో సిరీస్ ఒకే టైమ్‌లో ఉండనున్నాయి. అందువల్ల రెండు జట్లను బరిలోకి దింపేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకోసం 30- 35 ఆటగాళ్లతో కూడిన లిస్ట్ రెడీ అవుతోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లకు కూడా ఈ లిస్ట్ లో నుంచే ఎంపిక చేస్తాం. ఇక ప్రస్తుతం ఐపీఎల్ లో ఆడుతున్న కుర్రాళ్లకు ఇది గోల్డెన్ ఛాన్స్. మెరుగైన ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లను ఎంపిక చేస్తాం. అయితే రెండు జట్లు కూడా పటిష్ఠంగానే ఉండాలని బోర్డు భావిస్తోంది' అని బోర్డు మెంబర్ ఒకరు చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబర్- అక్టోబర్ విండోలో భారత్ కు వెస్టిండీస్ తో టీ20 సిరీస్ ఉంది. స్వదేశంలో విండీస్ తో టీమ్ఇండియా 5 మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. అదే సమయంలో మరోవైపు జపాన్ వేదికగా ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో క్రికెట్ క్రీడ కూడా ఉంటుంది. అందుకే ఇలాంటి సందర్భాల్లో రెండు జట్లు ఉంటే బాగుంటుందని బోర్డు భావిస్తోంది. ఒక జట్టు విండీస్ తో సిరీస్ కు, ఇంకో టీమ్ ఆసియా గేమ్స్ లో పాల్గొంటుంది. ఇలా రెండు జట్లను గతంలో బీసీసీఐ ప్రయత్నించి సక్సెస్ అయ్యింది. 2022 ఆసియా క్రీడల్లో భాగంగా క్రికెట్ ను చేర్చారు. ఆ పోటీల్లో 2023 అక్టోబర్ లో మ్యాచ్ లు నిర్వహించారు. అదే సమయంలో సీనియర్ ఆటగాళ్ల జట్టు వన్డే వరల్డ్ కప్ కోసం సన్నద్ధం అవుతోంది. అందుకే రుతురాజ్ గైక్వాడ్ నేతృత్వంలోని యువ జట్టును బీసీసీఐ చైనాకు పంపింది. ఆ క్రీడల్లో సత్తా చాటిన యువ భారత్ గోల్డ్ మెడల్ సాధించింది.

# స్పోర్ట్స్

## బాబర్ అజామ్ అద్భుత ప్రదర్శన



పాకిస్థాన్ సూపర్ లీగ్ లో పెషావర్ జల్మీ కెప్టెన్ బాబర్ అజామ్ అద్భుత ప్రదర్శనతో మెరిశాడు. క్వెట్టా గ్లాడియేటర్స్‌పై జరిగిన మ్యాచ్‌లో అతను శతకంతో చెలరేగి జట్టుకు కీలకంగా మారాడు. ముఖ్యంగా చివరి ఓవర్ చివరి బంతికి వేగంగా పరుగెత్తి, చాకచక్యంగా డైవ్ చేసి తన సెంచరీని పూర్తి చేయడం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. టీ20లకు అతను సరిపోడని విమర్శించిన వారికి, 192.31 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో బాబర్ గట్టి సమాధానం ఇచ్చి పాకిస్తాన్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేశాడు. కరాచీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో బాబర్ అజామ్ ఓపెనర్‌గా వచ్చి మొదటి నుంచే దూకుడుగా ఆడాడు. సాధారణంగా నిదానంగా ఆడే తన శైలిని పక్కనపెట్టి, బంతిని మైదానం నలుమూలలా చెదరగొట్టాడు. కేవలం 52 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు సాధించిన అతని ఇన్నింగ్స్‌లో 6 బౌండరీలు, 4 భారీ సిక్సర్లు ఉన్నాయి.గత మూడేళ్లుగా పెద్ద జట్లపై విఫలమవుతాడన్న విమర్శలను ఎదుర్కొన్న బాబర్, 2026 ప్సూలో తన ఫామ్‌ను తిరిగి చాటుకున్నాడు. పెషావర్ ఇన్నింగ్స్‌లో చివరి ఓవర్‌ను క్వెట్టా బౌలర్ జహాందాద్ ఖాన్ వేశాడు. చివరి బంతికి సెంచరీ పూర్తి చేయడానికి బాబర్ అజామ్‌కు 2 పరుగులు అవసరమయ్యాయి. బంతిని కొట్టిన వెంటనే అతను వేగంగా పరుగెత్తి, రనౌట్ ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి డైవ్ చేస్తూ తన శతకాన్ని పూర్తి చేశాడు.బాబర్‌కు అండగా నిలిచిన కుశల్ మెండీస్ 44 బంతుల్లో 83 పరుగులు చేసి మంచి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు 75 బంతుల్లో 135 పరుగులు జోడించారు. ఈ శతకంతో బాబర్ అజామ్ కెరీర్‌లో పలు చారిత్రక రికార్డులను సృష్టించాడు. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 12,000 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా అతను నిలిచాడు. కేవలం 338 ఇన్నింగ్స్‌లలోనే ఈ అరుదైన మైలురాయిని చేరుకుని రికార్డు నెలకొల్పాడు.వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ (344 ఇన్నింగ్స్‌లు), భారత స్టార్ విరాట్ కోహ్లీ (360 ఇన్నింగ్స్‌లు) సాధించిన రికార్డులను అతను అధిగమించాడు. వారిద్దరి కంటే వేగంగా ఈ ఘనత సాధించాడు.ప్రస్తుత 2026 ప్సూ టోర్నమెంట్‌లో బాబర్ అజామ్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. అతను ఇప్పటివరకు 7 ఇన్నింగ్స్‌లలో 401 పరుగులు చేశాడు. ఈ సెంచరీ తర్వాత అతని బ్యాటింగ్ సగటు ఏకంగా 100.25కి చేరింది. టీ20 మ్యాచ్‌లలో దూకుడుగా పరుగులు సాధించగల తన సామర్థ్యాన్ని బాబర్ అజామ్ సుదీర్ఘ కాలం తర్వాత మరోసారి నిరూపించుకుని విమర్శకుల నోళ్లను మూయించాడు.

## అర్ష్‌దీప్ సింగ్‌ను హగ్ చేసుకున్న ప్రీతి జింటా

ఐపీఎల్ 2026 సీజన్లో పంజాబ్ కింగ్స్ జట్టు అద్భుతమైన ప్రదర్శనతో దూసుకుపోతోంది. తాజాగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ విజయం సాధించింది. ఈ విజయం తర్వాత మైదానంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్, ఆ జట్టు సహ యజమాని ప్రీతి జింటా మధ్య జరిగిన ఓ ఆత్మీయ సంభాషణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మ్యాచ్ ముగిసిన వెంటనే మైదానంలో వచ్చిన ప్రీతి జింటా.. తన జట్టు ఆటగాళ్లను అభినందిస్తూ ఉత్సాహపరిచారు. ఈక్రమంలో అర్ష్‌దీప్ సింగ్‌ను చూసిన ప్రీతి.. తన సంతోషాన్ని ఆపుకోలేక అతడిని ఆత్మీయంగా కౌగిలించుకున్నారు. ఈ తరుణంలో అర్ష్ దీప్ సింగ్ ఎగిరి గంతేయడంతో అక్కడ ఉన్న జట్టు సభ్యులతో పాటు ప్రీతి జింటా కూడా ఆశ్చర్యపోయింది. అర్ష్‌దీప్ కూడా తన యజమాని అభినందనలకు ఎంతో ఉత్సాహంగా




స్పందించినట్లు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య ఉన్న ఈ అనుబంధం, గౌరవం చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా ఈ వీడియోలో పంజాబ్ కింగ్స్ జట్టు సభ్యులందరూ కలిసి విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవడం కనిపిస్తోంది. అర్ష్‌దీప్ సింగ్ తనదైన శైలిలో చిందులు వేస్తూ, చేతులెత్తి గెలుపు కేకలు వేస్తూ కెమెరాకు చిక్కాడు. పంజాబ్ జట్టు యాజమాన్యం, ఆటగాళ్ల మధ్య ఉన్న ఈ స్నేహపూర్వక వాతావరణమే వారి విజయాల రహస్యమని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్న పంజాబ్ కింగ్స్.. ఇదే ఊపుతో ముందుకు సాగాలని అభిమానులు కోరుకుంటున్నారు. ప్రీతి జింటా తన జట్టుకు అందించే నైతిక మద్దతు, ఆటగాళ్లలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపుతోందని ఈ వైరల్ వీడియో ద్వారా మరోసారి స్పష్టమైంది.




# యూత్ మూవీకి రిషబ్ శెట్టి ఫిదా

ఇటీవల విడుదలై మంచి ఆదరణ సొంతం చేసుకుంటోంది 'యూత్' మూవీ. ఇప్పటికే దీనిపై ఎంతోమంది సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించగా.. తాజాగా రిషబ్‌శెట్టి కూడా దీనికి ఫిదా అయ్యారు. ఎక్స్ వేదికగా దీనిపై పోస్ట్ పెట్టారు. చాలాకాలం తర్వాత, ఒక సినిమా చూస్తున్నంతసేపు నేను నవ్వుతూనే ఉన్నాను. 'యూత్' సినిమాలో ఎన్నో భావోద్వేగాలున్నాయి. తల్లిదండ్రులకు ఇచ్చిన గొప్ప బహుమతి 'యూత్'. తెరపై నటీనటులంతా చాలా సహజంగా కనిపించారని రిషబ్ అన్నారు. దర్శకుడి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన రిషబ్ సినిమా రంగానికి కెన్ కరుణాస్ ఒక గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు.యూత్' కథేంటంటే..: మధ్యతరగతి కుటుంబానికి చెందిన టీనేజర్ ప్రవీణ్ (కెన్ కరుణాస్). అతడి అల్లరి పనుల వల్ల స్కూల్‌లో ఏ అమ్మాయీ తనవైపు కన్నెత్తి కూడా చూడదు. కానీ, ప్రవీణ్ మాత్రం తన స్కూల్ లైఫ్ పూర్తయ్యేలోపు ప్రేమించాలన్న లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ క్రమంలోనే గంగవల్లి (అనీషా అనిల్ కుమార్), ప్రేషిక (మీనాక్షి దినేష్), సోనాల్ (ప్రియాన్షీ యాదవ్) తన జీవితంలోకి వస్తారు. మరి ఆ ముగ్గురి వల్ల ప్రవీణ్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ప్రేమ, బ్రేకప్, అవమానాలు లాంటి అనుభవాలతో అతడు నేర్చుకున్న జీవిత పాఠమేంటి? ఈ ప్రయాణంలో తన తల్లిదండ్రులు ఉన్నికృష్ణన్ (సూరజ్ వెంజరమూడు), సరోజ (దేవదర్శిని) పాత్రలకి ఉన్న ప్రాధాన్యం ఏంటి? వారి కలల్ని హీరో నెరవేర్చాడా? అన్నది మిగిలిన కథ.




# పెద్దిలో స్పెషల్ సాంగ్ కోసం సంయుక్త మీనన్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుండి దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. తాజాగా ఈ సినిమా గురించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఒక ప్రత్యేక గీతం కోసం 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రామ్ చరణ్ సినిమాల్లో పాటలు, ముఖ్యంగా మాస్ సాంగ్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'పెద్ది' కోసం ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అదిరిపోయే ట్యూన్ సిద్ధం చేశారని సమాచారం. ఈ మాస్ నంబర్‌లో రామ్ చరణ్ సరసన సంయుక్త మీనన్ ఆడిపాడనుందనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యింది. సంయుక్త తొలిసారిగా అఖండ 2 లో బాలయ్య సరసన జాజికాయ అనే స్పెషల్ సాంగ్ లో నటించి మెప్పించింది. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్‌లో మెగా హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. అయితే ఈ స్పెషల్ సాంగ్ లో చరణ్ సరసన మానస వారణాసి, మృణాల్ ఠాకూర్, పూజాహెగ్డే వంటి భామల పేర్లు వినిపించాయి కానీ చివరికి సంయుక్తకు డైరెక్టర్ బుచ్చిబాబు గ్రీన్ సిగ్నల్ ఇసినట్టు తెలుస్తోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా 'పెద్ది' రూపొందుతోంది. ఇందులో రామ్ చరణ్ మునుపెన్నడూ లేని విధంగా ఒక కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇప్పుడు సంయుక్త మీనన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

# హోంబలే నుంచి మహావతార్ పరశురామ్




కేజీఎఫ్, కాంతారా, సలార్, మహావతార్ నరసింహ.. ఇలా వరుస బ్లాక్‌బాస్టర్స్‌తో సినిమా స్థాయిని పెంచిన నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి రాబోతున్న మరో యానిమేటెడ్ దృశ్యకావ్యం 'మహావతార్ పరశు రామ్' రాబోతోంది. పరశురామ జయంతి సందర్భంగా 'మహావతార్' సినీమాటిక్ యూనివర్స్‌ని ప్రజెంట్ చేస్తూ ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని, గ్లింప్స్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గొడ్డలి చేతబట్టి నరమేధాన్ని సృష్టిస్తున్న పరశురాముడ్ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పరశు రాముడి ముఖాన్ని చూపించకుండా, ఆయన చేతిలో రక్తంతో తడిసిన పరశును(గొడ్డలి), రక్తంతో తడిచి ముద్దయిన యుద్ధభూమిని, దూరంగా భీతితో చూస్తున్న సైన్యాన్ని పోస్టర్‌లో చూపిస్తూ కథపై మరింత ఆసక్తిని పెంచారు మేకర్స్. మహావిష్ణు అవతారాల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కథ మోడ్రన్ విజువల్ వండర్‌గా, గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో అలరిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.

# ఆ విషయంలో కఠినంగా ఉంటున్నా..



దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవడం, స్టార్‌డమ్ ఉండగానే నాలుగు డబ్బులు వెనకేసుకొని సెటిల్ అయిపోవడం హీరోయిన్లకు పరిపాటే. కానీ మృణాళ్‌ఠాకూర్ మాత్రం అందుకు భిన్నంగా ఆలోచిస్తున్నది. స్టార్ హీరో సినిమా అయినా సరే.. పారితోషికం భారీగా ముట్టజెబుతామన్నా సరే.. పాత్ర నచ్చకపోతే 'నో' చెప్పేస్తానని నిర్మొహమాటంగా చెప్పేసింది మృణాళ్‌ఠాకూర్. 'నటికి సంతృప్తి అవసరం. 'సీతారామం'లో సీతామహాలక్ష్మి పాత్ర, 'హాయ్ నాన్న'లో యష్ణ పాత్ర నా కెరీర్‌కి ఓ గౌరవాన్ని కట్టబెట్టాయి.ఏమాత్రం ప్రాధాన్యత లేని కమర్షియల్ రోల్స్ చేసి ఆ గౌరవాన్ని పోగొట్టుకోలేను. అందుకే కథలు వినే విషయంలో కాస్తంత కఠినంగానే ఉంటున్నా. డబ్బుకోసమో, లేక పెద్ద సంస్థ అనో కళ్లు మూసుకొని సంతకం చేయట్లేదు. కథలో లోతు, పాత్రలో బలం ఉందనిపిస్తేనే 'ఓకే' చెబుతున్నా. రీసెంట్‌గా వచ్చిన 'డెకాయిట్' సినిమాలోని పాత్రను కూడా ప్రాధాన్యతను బట్టే 'ఎస్' చెప్పాను. అనుకున్నట్టే ఆ పాత్రకు మంచి స్పందన వస్తున్నది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది మృణాళ్‌ఠాకూర్.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com